

# పీఎంశ్రీ స్కూళ్లలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

## ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజానావ, సిరిసిల్ల :** జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన స్కూళ్లలో మొదలు పెట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పీఎంశ్రీ కింద ఎంపిక అయిన విద్యాలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయంలో శుక్రవారం జిల్లా విద్యాధికారి, టీజీఈడబ్ల్యూఐడీసీ అధికారులతో ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఎంశ్రీ కింద జిల్లాలో మొత్తం 16 విద్యాలయాలు ఎంపిక అయ్యాయని, వాటిలో అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, వర్షం నీరు ఇంకుడు గుంతలు ఇతర నిర్మాణాలు ఉన్నాయని ఇన్‌చార్జి కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. పీఎంశ్రీ కింద ఎంపికైన విద్యాలయాల్లో ఒక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆయా స్కూళ్లలో పనులను జిల్లా విద్యాధికారి పరిశీలించాలని ఆదేశించారు. కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో చేపట్టిన పనులను పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, టీజీఈడబ్ల్యూఐడీసీ డీఈ సత్యనారాయణ రావు, ఏఈలు నాగరాజు, అశోక్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితుడికి.. మూడు సంవత్సరాల జైలు, 5 వేల జరిమానా



**ప్రజానావ, సిరిసిల్ల :** దొంగతనం కేసులో ఒక వ్యక్తికి మూడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు పట్టణ సిఐ కృష్ణ తెలిపారు. ఈ మేరకు వెంకటరావునగర్ కు చెందిన గూడెం శంకర్ వ్యాపారం చేసుకుని జీవిస్తుండగా 2025, అక్టోబర్ 7న రాత్రి గేటుకు తాళం వేసి ఇంటిలో పడుకొని ఉదయం అందాదా 4 గంటలకు ఇంటి నుండి బయటికి వచ్చి చూడగా పవర్లూంకు సంబంధించిన నాలుగు ఇనుప తాలీలు కనిపించలేదు. వాటి ఒక్కొక్కదాని విలువ రూ.1500 ఉంటుంది. దీనిపై సీసీ టీవీ కెమెరాను చెక్ చేయగా అందాదా రాత్రి 11 గంటల సమయంలో సిరిసిల్లకు చెందిన పడిగల లక్ష్మణ్ అనే వ్యక్తి కాంపౌండ్ గోడను దూకి ఇంటిలోకి ప్రవేశించి నాలుగు ఇనుప తాలేలను తీసుకొని వెళ్ళినట్లుగా ఉన్నది. అతనిపై తగు చర్య తీసుకోగలరని దూడం శంకర్ సిరిసిల్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఇప్పటి ఎస్సై కే. వినీత రెడ్డి ఎఫ్ఐఆర్ నమోదు చేసి దొంగతనం చేసిన పడిగెల లక్ష్మణ్ ఇందిరానగర్ సిరిసిల్ల అని ఏదో ఒకటి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించి అనంతరం కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. తర్వాత సీఎంఎస్.ఎస్ఐ. శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్ట్ కానిస్టేబుల్ వేముల నరేష్ ఆరు మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేలుమల సందీప్ వాదించగా కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఏ ప్రవీణ్ నేరస్తుడు అయిన పడిగే లక్ష్మణ్ కు మూడు సంవత్సరాల కఠిన కారాగారా జైలు శిక్షతోపాటు రూ. 5000 ల జరిమానా విధించడం జరిగిందని సిరిసిల్ల పట్టణ సిఐ కృష్ణ తెలిపారు.

# ఆర్థిక పునరావస సహాయానికి దివ్యాంగులకు ఇంటర్వ్యూలు

## ఐడీఓసీలో ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ నిర్వహణ



**ప్రజా నావ, సిరిసిల్ల :** ఆర్థిక పునరావాస సహాయ పథకానికి సంబంధించి జిల్లాలోని ఆయా మండలాల నుంచి దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దివ్యాంగుల ఆర్థిక సహాయ పునరావాస పథకం కింద జిల్లాకు 14 యూనిట్లు మంజూరు కాగా ఒక్కో యూనిట్ విలువ రూపాయలు 50,000 వేలు. 100 శాతం రాయితీ ఉంటుంది. జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన 38 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో శుక్రవారం దివ్యాంగులకు ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 37 మంది దివ్యాంగులు హాజరుకాగా, వారికి సంబంధించిన సర్టిఫికెట్లు, అర్హతలు పరిశీలించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్వ్యూలో డీఆర్డీఓ గీత, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, ఎస్సీ కార్పొరేషన్ అధికారి స్వప్న, ఏవో మెప్మా మీర్జా ఫసహత్ అలీ బేగ్ ఉన్నారు.

# సింగిల్ తల్లి కూడా పూర్తి పేరెంట్

- పిల్లల గుర్తింపుకు సంబంధం లేని వ్యక్తితో ఎందుకు ముడిపెట్టాలి?
- లైంగికదాడి బాధితురాలికి అనుకూలంగా బాంబే హైకోర్టు తీర్పు




**ప్రజానావ, ముంబై:** తన కుమార్తె తండ్రి పేరును పాఠశాల రికార్డుల నుండి తొలగించాలని కోరుతూ అత్యాచార బాధితురాలైన తల్లి దాఖలు చేసిన పిటిషన్‌ను బాంబే హైకోర్టులోని ఔరంగాబాద్ బెంచ్ విచారించింది. తన బిడ్డను ఒంటరిగా పెంచుతున్న తల్లిని, ఒంటరి తల్లిగా పరిగణించడం జాలి కాదు, రాజ్యాంగం పట్ల విధేయత అని కోర్టు పేర్కొంది. "ఒక బిడ్డ గుర్తింపును తన జీవితంలో ప్రమేయం లేని తండ్రితో ఎందుకు ముడిపెట్టాలి? రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 గౌరవంగా జీవించే హక్కును ఇస్తుంది. గుర్తింపు కూడా ఆ గౌరవంలో భాగం" అని న్యాయమూర్తులు విభా కంకన్వాడి, హితేన్ వేణుగోంకర్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిజానికి, ఈ కేసులో తల్లి అత్యాచార బాధితురాలు. డీఎన్ఏ పరీక్షలో నిందితుడు జీవసంబంధమైన తండ్రి అని నిరూపించబడింది. కానీ అతను బిడ్డ నుండి విడివిడిగా జీవించడానికి ఇష్టపడ్డాడు. అయినప్పటికీ, జనన ధృవీకరణ పత్రం మరియు పాఠశాల రికార్డులలో తండ్రి పేరు నమోదు చేయబడింది. పాఠశాల దీనిని సరిదిద్దడానికి నిరాకరించడంతో, తల్లి మరియు కుమార్తె హైకోర్టును ఆశ్రయించారు. పాఠశాలకు కుల ధృవీకరణ చేసే అధికారం లేదని, కానీ ప్రత్యేక సందర్భాలలో రికార్డులను సరిదిద్దవచ్చని కోర్టు స్పష్టం చేసింది.

### ఒంటరి తల్లుల హక్కులను గుర్తించాలి

ఔరంగాబాద్ బెంచ్‌లో కూర్చున్న జస్టిస్ విభా కంకన్వాడి మరియు జస్టిస్ హితేన్ వెనెగాంకర్‌లతో కూడిన ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. ఒంటరిగా పిల్లలను పెంచే మహిళల హక్కులను ప్రభుత్వ స్థాయిలో కూడా గుర్తించాలని ధర్మాసనం పేర్కొంది.

### పాఠశాల రికార్డులు పబ్లిక్ డాక్యుమెంట్లు

పాఠశాల రికార్డులు ప్రైవేట్ రికార్డులు కావని కోర్టు పేర్కొంది. అవి చాలా సంవత్సరాలుగా పిల్లల వద్ద ఉండే పబ్లిక్ డాక్యుమెంట్లు మరియు అతని విద్య, వృత్తి జీవితంలో ఉపయోగించబడతాయి. అటువంటి పరిస్థితిలో, ఫార్మాట్ కారణంగా తండ్రి పేరును ప్రస్తావించమని బలవంతం చేయడం సరైనది కాదు. తండ్రి పేరును తప్పనిసరి చేసి, తల్లి పేరును ఐచ్ఛికంగా మార్చే ప్రభుత్వం, డాక్యుమెంటేషన్ ద్వారా అసమానతను పదే పదే ప్రదర్శిస్తుందని ధర్మాసనం పేర్కొంది.

### కుల మార్పుపై కోర్టు పాత్ర

పిల్లల కులాన్ని మార్చాలన్న దరఖాస్తుపై కోర్టు మాట్లాడుతూ, కులాన్ని అలా మార్చలేమని, పాఠశాల అనేది కులాన్ని నిర్ణయించే సంస్థ కాదని పేర్కొంది. షెడ్యూల్డ్ కులానికి చెందిన తల్లి పెంచుతున్న బిడ్డను రాష్ట్రం కఠినమైన మరియు పితృస్వామ్య పాలనలో బలవంతం చేయరాదని ధర్మాసనం పేర్కొంది. తండ్రి నుండి శాశ్వతంగా విడిపోయిన పిల్లవాడు తన తండ్రి కులాన్ని పాఠశాల రికార్డులలో ఉంచాల్సిన అవసరం లేదని కూడా కోర్టు పేర్కొంది. కులాన్ని ఏకపక్షంగా మార్చడం కోసం కోరిన ఉపశమనం కాదని, ప్రస్తుత సామాజిక మరియు చట్టపరమైన స్థితిని సరిగ్గా ప్రతిబింబించేలా రికార్డులోని స్పష్టమైన లోపాన్ని సరిదిద్దడమేనని కోర్టు పేర్కొంది.

### పిల్లల ఆసక్తులే ప్రధానం

కుల ధ్రువీకరణ పత్రాల దుర్వినియోగం జరిగే అవకాశం ఉందని, పాఠశాలలను కుల ధృవీకరణ సంస్థలుగా మార్చకూడదనే ఆందోళనలు చెల్లుబాటు అవుతాయని ధర్మాసనం పేర్కొంది. కాబట్టి, ప్రక్రియ యొక్క సమగ్రతను కాపాడుకునే విధంగా మరియు పిల్లల ప్రయోజనాలను కూడా కాపాడే విధంగా సహాయం అందించాలని ధర్మాసనం పేర్కొంది.

# నాలుగేండ్ల బాలున్ని రాత్రంతా అంగన్‌వాడీలో ఉంచి తాళం వేసిన సిబ్బంది

## నాగ్‌పూర్‌లో దారుణ సంఘటన.



**ప్రజానావ, ముంబై:** అంగన్‌వాడీ సిబ్బంది తప్పిదం వల్ల 4 ఏళ్ల బాలుడు రాత్రంతా తరగతి గదిలో ఉండిపోయిన దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. బాలుడి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో, రాత్రంతా బాలుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు పోలీసుల సూచనల మేరకు, తెల్లారిన తర్వాత పాఠశాల తాళం తీయగా, అంగన్‌వాడీలో భయంతో వణుకుతున్న బాలుడు కనిపించాడు. ఈ సంఘటన తల్లిదండ్రులలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం, నాగ్‌పూర్ జిల్లాలోని ఖపర్ఖేడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోర్కర్ లేఅవుట్ ప్రాంతంలోని ఒక అంగన్‌వాడీలో ఈ సంఘటన జరిగింది. బుధవారం మధ్యాహ్నం 4 ఏళ్ల చిన్నారి అంగన్‌వాడీకి వెళ్లాడు. అక్కడ ఆడుకుంటూ పక్క గదికి వెళ్లి ,అక్కడే నిద్రపోయాడు. సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత, సిబ్బంది పక్క గదిని తనిఖీ చేయకుండా బయటి నుండి పాఠశాలకు తాళం వేసుకుని ఇంటికి వెళ్లిపోయారు. చీకటి అయిన బాలుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో, అతని తల్లిదండ్రులు అన్ని చోట్ల వెతకడం ప్రారంభించారు. కానీ అతను ఎక్కడా కనిపించలేదు. చివరకు అతన్ని కిడ్నాప్ చేసి ఉంటారనే భయాన్ని స్థానికులు వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు వెంటనే ఖపర్ఖేడ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు కూడా సంఘటన తీవ్రతను గ్రహించి కిడ్నాప్ కేసు నమోదు చేశారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సందీప్ పఖలే నేతృత్వంలో, బాలుడి కోసం వెతకడానికి 7 పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసులు రాత్రంతా ఆ ప్రాంతంలోని సీసీటీవీని తనిఖీ చేసి బాలుడి కోసం వెతికారు. ఇది మాత్రమే కాదు, చుట్టుపక్కల ఉన్న చెరువులు, కాలువలను వెతికారు. కానీ బాలుడి జాడ కనిపించలేదు. దాంతో తల్లిదండ్రుల ఆందోళన ఇంకా పెరిగింది. రాత్రంతా వెతికిన తర్వాత పోలీసులు వెతుకులాట ఆపేసి, మరుసటి రోజు ఉదయం తమ పనిని తిరిగి ప్రారంభించారు. చివరకు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సందీప్ పఖలే స్వయంగా సంఘటనా స్థలానికి వెళ్లి అంగన్‌వాడీని తనిఖీ చేయాలని నిర్ణయించుకున్నారు. అంగన్‌వాడీ తాళం తెరవమని సంబంధిత వ్యక్తులకు ఆదేశించారు. తాళం తెరిచిన వెంటనే అందరూ షాక్ అయ్యారు. ఆ బాలుడు పాఠశాలలో సురక్షితంగా కూర్చున్నాడు. రాత్రంతా చీకటిలో ఒంటరిగా కూర్చున్నందున అతను భయంతో వణుకుతున్నాడు. అందుకే, తన తల్లిని చూసిన వెంటనే, బాలుడు ఆమెను కౌగిలించుకుని కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ సంఘటన తర్వాత, పోలీసులు పాఠశాల, అంగన్‌వాడీ నిర్వాహకులను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సందీప్ పఖలే గట్టిగా హెచ్చరించారు. పాఠశాలను మూసివేసేటప్పుడు లేదా తాళం వేసేటప్పుడు ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కోరారు. ఇలాంటి నిర్లక్ష్యం మరోసారి జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని కూడా వారు హెచ్చరించారు. ఈ సంఘటనపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# స్వచ్ఛ సిరిసిల్లగా ఆదర్శ పాలన అందిస్తా

## సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్లను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్తూ స్వచ్ఛ సిరిసిల్లగా ఒక ఆదర్శవంతమైన పురపాలక సంఘంగా సిరిసిల్లను తీర్చేద్దడం కోసం కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ జిందం కళ మాట్లాడుతూ కేసీఆర్ ఆశీస్సులతో, కేటీఆర్ సహకారంతో 2020లో, 2026లో కౌన్సిలర్‌గా ఎన్నికై చైర్మన్‌గా పదవి నిర్వర్తించగా చైర్మన్ పదవిని చేపట్టగలిగానని, ఈ చైర్మన్ పదవి చేపట్టడానికి తనకు సహకరించిన కౌన్సిలర్ సభ్యులకు.. 3వార్డు ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదీర్ పాష,, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ సభ్యులు, అధికారులు, నాయకులు, పుర ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఆసిఫాబాద్ జిల్లా కోర్టు ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తిగా వీరయ్య బాధ్యతల స్వీకరణ

**ప్రజానావ, ఆసిఫాబాద్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన ఎంవీ రమేష్ బదిలీ కావడంతో, వారి స్థానంలో మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య ఆసిఫాబాద్ జిల్లా కోర్టు ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు నూతన ప్రధాన న్యాయమూర్తిని సాదరంగా ఆహ్వానించారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు పూలగుచ్చాలు అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ యువ రాజు ప్రసంగిస్తూ, ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు వృత్తిపరంగా ఎంతో చురుకైన వారని, పని విషయంలో ఎప్పుడూ వెనుకడుగు వేయరని కొనియాడారు. ఇక్కడ బెంచ్, బార్ మధ్య సమన్వయం ఎంతో సవ్యంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య మాట్లాడుతూ ఈ జిల్లా ఇన్చార్జ్ బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని తెలిపారు. కోర్టు కార్యకలాపాల్లో భాగంగా వారానికి ఒకరోజు బెంచ్ నిర్వహించడం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న కేసులను ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పరిష్కరించడంలో న్యాయవాదులు తమ పూర్తి సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు టాస్ అభ్యాసకులకు పరీక్ష

**ప్రజానావ, ఆసిఫాబాద్ టౌన్ :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ ఆదేశాల మేరకు, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ నేతృత్వంలో నిర్వహించిన జూమ్ మీటింగ్ నిర్ణయం మేరకు ఈ నెల 22వ తేదీన పదవ తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు కొనసాగుతుంది. అదే రోజు ఇతర గురుకుల పరీక్షలు ఉన్నందున, పరీక్షా వేదికను మార్చినట్లు అధికారులు వెల్లడించారు. అభ్యాసకులందరూ జనాకాపూర్ లోని వేదిక ప్రాథమిక పాఠశాల (గాంధీ స్కూల్) కు చేరుకోవాలని సూచించారు. పరీక్ష రాసే విద్యార్థులు తప్పనిసరిగా తమ వెంట మొబైల్ ఫోన్ తీసుకురావాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జనకాపూర్) ప్రధానోపాధ్యాయురాలు ఉమాబాల, అసిస్టెంట్ కోఆర్డినేటర్ వడ్లూరి రాజేష్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అభ్యాసకులందరూ సమయపాలన పాటిస్తూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## తాగునీటి సమస్య పరిష్కారం



**ప్రజానావ, నేరడిగొండ:** వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా గ్రామ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ దృష్టి సారించారు. శుక్రవారం మండలంలోని వడూర్ గ్రామ నగరేశ్వరుని ఆలయం ముందర నూతన మోటారు పంపును బిగించి నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ ఎరడ్ల మమత చంద్రశేఖర్, పంచాయితీ సెక్రటరీ సద్దాం, వార్డు సభ్యులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

**ప్రజానావ, తాండూర్:** రాష్ట్రస్థాయి సీఎం కప్ రెస్లింగ్ పోటీలకు జెడ్పీహెచ్ఎస్ అచ్చులాపూర్ విద్యార్థిని చౌల్ల హర్షిత ఎంపికైనట్లు పీడీ సాంబమూర్తి తెలిపారు. ఈనెల 14న డీవైఎస్ఓ గ్రౌండ్ మంచిర్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ రెస్లింగ్ పోటీల్లో విద్యార్థిని ప్రథమ బహుమతిగా బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 21 నుంచి 23 వరకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ గచ్చిబౌలి స్టేడియం హైదరాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సదర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి, ఏఏపీసీ చైర్మన్ చిలకమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.



# బీసీలను మోసం చేస్తూ ఎన్నికలకా?

- 42 శాతం బీసీ రిజర్వేషన్లు వెంటనే అమలు చేయకుంటే అగ్గిరాజేస్తాం
- బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా




**ప్రజానావ, కరీంనగర్:** బిసి రిజర్వేషన్లు 42 శాతం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ సంఘం పిలుపు మేరకు బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ ఆద్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఆది మల్లేశం పటేల్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ లు మాట్లాడుతూ రాబోవు ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలను 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికల నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు బీసీల రిజర్వేషన్లు 42 శాతం పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని విస్మరించి గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందని దుయ్యబట్టారు. అయినప్పటికీ కూడా బీసీ వాదం బలంగా ఉన్నందున గ్రామపంచాయతీ ఎన్నికల్లో, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీలు సత్తా చాటారన్నారు. అత్యధికంగా బీసీలు గ్రామ సర్పంచ్ లుగా, మున్సిపల్ కార్పొరేటర్ లుగా కౌన్సిలర్ లుగా గెలుపొందడం జరిగిందని, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినటువంటి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాధవరెడ్డిని మున్సిపల్ ఎన్నికల్లో నిలబెట్టినప్పుడు బీసీలు అంతా కలిసి చిత్తుగా ఓడించారన్నారు. తెలంగాణ జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించడం అంటే ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనన్నారు. సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కడమే అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వశీ రిజర్వేషన్లు పెంచకుండా ఉన్న రిజర్వేషన్లు తగ్గిస్తూ ఎన్నికలు నిర్వహిస్తే మాత్రం రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, కళాకారులు అందర్నీ కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రభుత్వం గద్దె దిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు నల్లగొనీ శ్రీనివాస్, ఉమామహేశ్వర్, లింగంపల్లి శ్రీనివాస్,అంజాద్, పయ్యావుల మహేష్,బెల్లం నరేందర్, గున్నాల కన్నాంబ, నరాల శ్రీకాంత్, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్లోకి ‘ఇ విటరా’ ఎలక్ట్రిక్ కారు

**ప్రజానావ, కరీంనగర్ :** మార్కెట్లోకి సరికొత్త ఇ విటరా ఎలక్ట్రిక్ కారు విడుదలైంది. శుక్రవారం కరీంనగర్ లోని ఆదర్శ నెక్సా షోరూంలో వాహనాన్ని షోరూమ్ మేనేజర్ ఇ సాయి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజర్ మాట్లాడుతూ మార్కెట్లోకి వచ్చిన ఇ విటరా ఎలక్ట్రిక్ కారుకు రూ.10.99 లక్షలు ప్రారంభ ధరగా ఉందని తెలిపారు. ఒకసారి బ్యాటరీ ఫుల్ చార్జ్ చేస్తే 543 కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం ఈ కారు ప్రత్యేకత అన్నారు. 61, 49 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఆప్షన్లతో కారు అందుబాటులో ఉందని తెలిపారు. ఫాస్ట్ చార్జింగ్ సౌకర్యం ఉందని అన్నారు. వినియోగదారులకు మెరుగైన ప్రయాణ అనుభూతిని కలి గిస్తుందన్నారు. అధునిక భద్రత ఫీచర్లు, సుజుకి కనెక్టివిటీ, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ డిస్ప్లే వంటి మరియు అడాస్ 2 స్థాయి సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే దిశగా ఈ కారు ముందడుగులో నిలుస్తుందని తెలిపారు.




# సిరిసిల్ల కవి డా. జనపాలకు అంతర్జాతీయ

## మాతృభాష దినోత్సవ విశిష్ట ప్రతిభా పురస్కార ప్రదానం

**ప్రజానావ, సిరిసిల్ల :** తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, జాతీయ తెలుగు సారస్వత పరిషత్, ఆది లీల ఫౌండేషన్ న్యూఢిల్లీ, తెలుగు భాష చైతన్య సంస్థ ఆధ్వర్యంలో సిరిసిల్లకు చెందిన కవి, రచయిత డాక్టర్ జనపాల శంకరయ్య కు మాతృభాష దినోత్సవం విశిష్ట ప్రతిభా పురస్కారం అందజేశారు. ఈనెల 20న హైదరాబాద్ రవీంద్ర భారతి లో జరిగిన సమావేశంలో అధ్యక్షులు కేశిరాజు రాంప్రసాద్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా వాకులాభరణం కృష్ణమోహన్, ఆది లీల ఫౌండేషన్ న్యూఢిల్లీ ఆదినారాయణ, సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి తదితరులు చేతుల మీదుగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా హైదరాబాబాద్ రవీంద్ర భారతి లో జరిగిన సమావేశంలో డా. జనపాల శంకరయ్య విశిష్ట ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు భాష కు కథా రచనలోనూ వచన రచనలోనూ వ్యాసరచనలో పద్య రచనలోనూ పరిశోధన అంశంలోనూ వివిధ అంశములలో సాహితీ సేవ లందిస్తున్నందుకు



విశిష్ట ప్రతిభా పురస్కార అవార్డును అందిస్తున్నట్టు చెప్పారు. డా. జనపాల శంకరయ్య రచనలను రాజన్న సిరిసిల్ల జిల్లా సాహితీ సమితి సహ అధ్యక్షులు కోడం నారాయణ, నేరోజు రమేష్, ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్ బూర దేవానందం గుండెల్లి వంశీకృష్ణ, అశీకారపు రవి లు అభినందించారు.

# గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కారానికి చర్యలు

**ప్రజానావ, తిర్యాణి :** జిల్లాలోని గురుకుల పాఠశాలలలో నెలకొన్న సమస్యల పరిష్కారం పై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని తిర్యాణి మండలం చింతపల్లి గ్రామంలో గల గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రత అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందని తెలిపారు. వేసవికాలం సమీపిస్తున్నందున నీటి సమస్య లేకుండా నీటి లభ్యత ఉన్న ప్రాంతంలో బోర్ వెల్ ఏర్పాటు చేసే దిశగా గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వంట సమయంలో సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను పాటించాలని తెలిపారు. డార్మెటరీ గదిలో



మౌలికవసతులుపాయాలు కల్పించాలని, డ్రైనేజీ వ్యవస్థ పకడ్బందీగా నిర్వహించాలని, మూత్రశాలలకు తలుపులు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువల నిర్మాణాలకు అంచనా ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. విధుల పట్ల సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేసి మరోసారి ఆలస్యం కాకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులను మార్చాలని విద్యార్థులు కోరగా ప్రిన్సిపాల్ ను వెంటనే ఇతర ప్రాంతానికి డిప్యూటేషన్ పై పంపించి సీనియర్ ఉపాధ్యాయురాలు రమ్య కు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ బాధ్యతలను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# రాత్రి వేళల్లో హోటళ్లకు అనుమతివ్వండి

## కలెక్టర్‌కు వినతి

**ప్రజానావ, ఆసిఫాబాద్ :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ ఆధ్వర్యంలో నాయకులు నిసార్ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హరితకు వినతి పత్రం అందజేశారు. పీస్ కమిటీ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేసి, రంజాన్ మాసంలో రాత్రి వేళల్లో హోటళ్లు నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని వారు కోరారు. అలాగే ఇఫ్తార్ సమయంలో వాహనాల తనిఖీల వల్ల ఉపవాస దీక్షాపరులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రార్థనల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని విన్నవించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, నాయకులు సయ్యద్ నిసార్ మాట్లాడుతూ.. పండుగ సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. నాయకుల విన్నపం పై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సోమవారం జిల్లా అధికారులతో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ షబ్బీర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ జవిద్, హోటల్ యజమానుల సంఘం నాయకుడు సల్మాన్, ముఫాసిర్, అహ్మద్ పాల్గొన్నారు.






# అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరభ్యాసం




**ప్రజానావ, తాండూర్:** మండలంలోని మాదారంఉ3 అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సరూప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాదారం సర్పంచ్ కుసనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డిలు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు జరిపించారు. అనంతరం టీచర్ మీనా సర్పంచ్ కుసనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, సీడీపీఓ స్వరూప, 9వ వార్డు సభ్యురాలు సౌమ్యలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఎలాంటి సహాయ సహకారాలు అవసరమైనా గ్రామ పంచాయతీ నుంచి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఇందిరా, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



**ప్రజానావ, జైనూర్:** వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, జైనూర్ విద్యుత్ శాఖ సాయికిరణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పవర్ హౌస్ కాలనీ, మోహింపుర, ఎస్సీ కాలనీలను సందర్శించి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో ప్రధాన రోడ్లకు ఇరువైపులా త్రీఫేస్ సౌకర్యంతో పాటు ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు స్థితుల వ్యవస్థకు చేరుకోవడంతో వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. విద్యుత్ సరఫరాలో అధిక లోడు పడకుండా అవసరం ఉన్నచోట్ల నూతన మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 20 వరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు షేక్ రహీం, విద్యుత్ శాఖ ఎల్ఐ ప్రవీణ్, ఉద్యోగి ఇర్ఫాన్, సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్య మీది.. పరిష్కారం నాది

**ప్రజానావ, జైనూర్:** మండలంలోని పానాపటార్ మిషన్ భగీరథ పైప్ లైన్లను మరమ్మతు చేయిస్తున్నా మని సర్పంచ్ తులసిశంకర్ అన్నారు. ప్రతి ఇంటికి నీళ్లు ఇచ్చే భాధ్యత నాది అని పేర్కొన్నారు. తెలంగా ణ తొలి ముఖ్యమంత్రి ఏర్పాటు మిషన్ భగీరథ నీళ్లు పానాపటార్ గ్రామపంచాయతిలో ప్రతి పల్లెకు పైప్ లైన్లలను రిపేర్ చేసి ప్రతి ఇంటికి నీళ్ళే ఇచ్చే భాధ్యత నాది అన్నారు. పానాపటార్ గ్రామపంచా యతీ అభివృద్ధియే లక్ష్యమని, పల్లె, వాడ ఎక్కడ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకొనివస్తే సమస్యకు పరి ష్కారం చూపుతానన్నారు. ఈ కార్యక్రమములో వివిధ గ్రామాల ప్రజలు, గ్రామపంచాయతీ కార్మికులు, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల ఆధార్‌ను బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేయాలి

**ప్రజానావ, మంచిర్యాల:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం కింద విద్యార్థుల బ్యాంకు ఖాతాల ఆధార్ సీడింగ్, డీబీటీ యాక్టివేషన్ త్వరితగతిన చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ కళాశాలల విద్యార్థుల బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలని, సంబంధిత బ్యాంక్ ఎఎఎ అజూఎఱ.శీతీస్ర.ఱఅ ద్వారా డీబీటీ కోసం ఫ్లాగ్ చేయడం తప్పనిసరి అని పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ ఇతర కళాశాలల ప్రిన్సిపాళ్ళు తమ కళాశాలలోని బీసీ, ఈబీసీ విద్యార్థులకు డీబీపీ యాక్టివేషన్ కోసం ఆధార్ నంబర్ ను వారి బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేయాలని అన్నారు. తమ కళాశాలల నోటీస్ బోర్డ్ లో దశల వారీగా మార్గదర్శకాలు ప్రదర్శించడం ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సీఎస్ఎస్ బడ్జెట్ కింద బీసీ, ఈబీసీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ మంజూరు, పంపిణీకి ఇది అత్యవసరమని వివరించారు.

# పత్తి కొనుగోలు తేదీని పొడిగించాలి

**ప్రజానావ, తిర్యాణి:** సీసీఐ కొనుగోలు తేదీని పొడగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కున సురేష్ కోరారు. శుక్రవారం తహశీల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం సహకరించకపోవడంతో పత్తి దిగుబడి సరిగా రాలేదని, దీనికితోడు రైతులకు కూలీలు దొరకక పత్తి ఏరడం ఆలస్యమైందని పేర్కొన్నారు. రైతులు వెనుకబడి ఉన్నారని, సీసీఐ కేంద్రాలు కొనుగోలు ముగియడంతో రైతులు దళారులను, ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి తక్కువ రేటుకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. తద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. సీసీఐ కొనుగోలు చేస్తే కొంచమైనా అప్పులు తీరే పరిస్థితి ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాల తేదీని పొడగించాలని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మెస్రంగూడా సర్పంచ్ దేవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకం గౌరయ్య, బుర్ర రమేష్, బొల్లం మల్లేష్, రైతులు పెట్టం రాయలింగు, దౌలత్‌రావు, చిరంజీవి, కొర్వెత తుకారాం తదితరులు పాల్గొన్నారు.



# జూపల్లిని కలిసిన డీసీసీ చైర్మన్



**ప్రజానావ, నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ శుక్రవారం మంత్రి క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ మున్సిపల్ విజయం అనంతరం కలిసి శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ లో విజయం సాధించినందుకు గాను డీసీసీ అధ్యక్షుని మంత్రి జూపల్లి అభినందించారు. ఆదిలాబాద్ జిల్లాలో మున్ముందు కూడా ఇలాంటి విజయాలు కైవసం చేసుకోవాలని, అందరిని కలుపుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రఫుల్ చందర్ రెడ్డి, బోథ్ మార్కెట్ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, నేరడిగొండ మండల మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి

**ప్రజానావ, బెజ్జూర్:** జిల్లాలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలతో రైతులు మోసపోతున్నారని ఆదివాసి మండల సారమేడి కొడప శంకర్ అన్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సీసీఐ అధికారులు పత్తిని అనవసరంగా కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెట్టారని తెలిపారు. దీంతో దళారీ వ్యవస్థ బలపడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సీసీఐ కేంద్రాలకు తీసుకువచ్చిన పత్తి పంటలో చెత్త ఇతర సాంకేతిక కారణాలను చూపుతూ పత్తి వాహనాలను తిప్పి పంపడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా నేటితో పత్తి కొనుగోలు గడువు ముగుస్తుండడంతో రైతులు తమ పత్తి పంటను సీసీఐ కేంద్రాలకు వెళ్లిన వాహనాలు అధికారులు తిప్పి పంపగా అదే పత్తిని ప్రైవేట్ వ్యక్తులు ఏలా తీసుకుంటున్నారని ప్రశ్నించారు. తమ పత్తి పంట బాగోలేదని చెబుతూ దళారులకు పత్తి విక్రయించిన తర్వాత అదే పంటను తిరిగి సీసీఐకి వారు అమ్ముతున్నారని విమర్శించారు. సరైన సమయానికి వర్షాలు రాక, మరోవైపు కూలీలు సమయానికి దొరకకపోవడంతో పంట తీయకపోయి సమయం పూర్తయిందని రైతులు ఆవేదన చెందుతున్నట్లు పేర్కొన్నారు. రైతుల వద్ద నిల్వ ఉన్న పత్తిని తేమ, ఇతర కారణాలు చెప్పి ఇబ్బందులు పెట్టకుండా పూర్తి స్థాయిలో పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.






# ఆత్మ చైర్మన్ ప్రమాణ స్వీకారం




**ప్రజానావ, మావల:** ఆదిలాబాద్ బ్లాక్ ఆత్మ చైర్మన్‌గా గిమ్మ సంతోష్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలు ఆదే గజేందర్, కంది శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి, వ్యవసాయరంగ పురోగతికి ఆత్మ ముఖ్యమైన వేదికగా పనిచేయాలన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగం బలోపేతమైతేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నూతన కౌన్సిలర్లు, కార్య కర్తలు పాల్గొన్నారు.

